# రాంబాబు - కథాన్వేషణ

పి. యస్. యమ్. లక్ష్మి

రాంబాబు పదోసారి నొక్కుల్లేని నున్నని క్రాప్‌ని కష్టపడి పేజ్‌లైన్ రాసి నొక్కుల జుట్టుగా కనిపించేట్లు దువ్వుకున్నాడు. అందమైన ఆడపిల్లలకి నొక్కుల జుట్టంటే అభిమానమని రాంబాబు నమ్మకం. అద్దంలో దూరం నుంచి, దగ్గర నుంచి వివిధ భంగిమల్లో చూసుకుని "రైటో రాంబాబూ, నీముందు వంద మంది సినిమా హీరోలయినా దిగదుడుపే" అని తనని తను మెచ్చుకుని, తల కదిపితే నొక్కుల జుత్తు ఎక్కడ పాడవుతుందోనని మెడ బిగపట్టుకుని రూమ్ లాక్‌చేసి రోడ్డుమీద కొచ్చాడు, "మనిషి రోడ్డున పడ్డాడు" అనుకుంటూ సినిమా పిచ్చి రాంబాబు.

అయితే ఇప్పుడు రాంబాబు వెళ్ళేది ఏ కొత్త తెలుగు సినిమాకీ కాదండోయ్, అతను వెళ్ళేది అమ్మాయిల వేటకీకాదు, అందమైన అమ్మాయిలు కనబడితే కొంచెం పోజిస్తాడంతేగానీ రాంబాబు చాలా బుద్ధిమంతుడే. అమ్మాయిలంతా తను చాలా అందగాడనుకోవాలనీ, తనంత గొప్ప రచయిత ప్రపంచంలో లేడని అనుకోవాలనే సదుద్దేశ్యం తప్ప వేరే దురుద్దేశంలేని మంచి బాలుడు రాంబాబు

రాంబాబు ఒక చిన్నసైజు రచయిత, చిన్నసైజంటే మనిషి కాదండీ బాబూ. రాంబాబుకేం ఇంచక్కా యద్దనపూడి సులోచనారాణి నవల్లో నాయకుడిలా వుంటాడు, అతని కథలేవో ఒకటి రెండు, రెండు మూడు నెలలు బ్రతికిన పత్రికల్లో పడ్డాయి. అప్పటి నుంచీ రాంబాబుకి తానో గొప్ప రచయితననే విశ్వాసం. ఆ విశ్వాసం తోటే ఏదో ఒక నాటికి అఖిలాంధ్ర ప్రజానీకానికి తానే అభిమాన రచయిత నవుతానని కలలు గంటున్నాడు - అదేదో సినిమాలోలా "ఆశ అశ ఆశ"అని గొణిగే మనసును లెక్కచేయకుండా.

ప్రస్తుతం ఒక ప్రముఖ మాసపత్రిక నిర్వహిస్తున్న కథల పోటీకి ఒక మాంచి కథరాసి పంపాలని, మొదటి బహుమతి తనకే రావాలనీ ఆశించి, అంత మంచికథ ప్లాటుకోసం వెతుక్కుంటూ రోడ్డున పడ్డాడు రాంబాబు మనిషన్న తర్వాత ఆశ వుండకుండా వుండదు కదండీ, అయ్యో, మనం కబుర్లల్లో పడి రాంబాబు సంగతి మరచిపోయాం.

ఆ, అదిగో అక్కడ చౌరస్తాలో నుంచుని వచ్చే పోయేవాళ్ళని గమనిస్తున్నాడు శ్రద్ధగా మన కథానాయకుడు. ఎందుకైనా మంచిదని విఘ్నేశ్వరుణ్ణి మనసులోనే ప్రార్థించాడు మంచిప్లాటు దొరికేట్లు చెయ్యమని.

ఇంతలో ఓ నలుగురు కాలేజీ అమ్మాయిలు రాంబాబుకి కొంచెం దూరంలోవచ్చి నుంచున్నారు, కాలేజీ అమ్మాయిల కథయితే పసందుగా వుంటుందని వాళ్ళ వంక దొంగ చూపులు చూస్తూ వాళ్ళ సంభాషణ వినసాగాడు. అయితే పాపం ఎంత శ్రద్ధగావిన్నా వాళ్ళే భాషలో మాట్లాడు కుంటున్నారో రాంబాబు కర్థం కాలేదు. కాలేజీ అమ్మాయిల కంటూ ప్రత్యేకమైన భాష ఒకటుందా అనే డైలమాలో పడిపోయాడు కాసేపు, అంతా అబ్బాయిలేవున్న కాలేజీలో చదివిన

రాంబాబు. వాళ్ళందరి నోటినుంచి కామన్‌గా వస్తున్న శబ్దాన్ని మాత్రం రీసెర్చి చేసి కనిపెట్టాడు మన బ్రిలియంట్ బాయ్ అదేమిటో మీకు తెలుసా? తెలియదా? అయితే రాంబాబునే అడుగుదాం. "యా", జగదేకవీరునికథ సినిమావచ్చిన కొత్తల్లో "హలా" అని పలకరించుకున్నట్లు, ఇప్పుడు ప్రతిదానికి "యా" అనటం ఫేషన్ కాబోలనుకున్నాడు క్షణక్షణానికీ మారుతున్న ఫాషన్లతో పరిగెట్టలేని మన హీరో మొత్తానికి అక్కడక్కడా అర్థమయిన కాలేజీ అమ్మాయిల సంభాషణ సినిమాలమీద, ఫాషన్లమీద, మొగవాళ్ళని తిట్టటంమీద (మహిళాదశాబ్దం కాబోలు!) తప్పితే వేరే లేదనీ, అందులో తనకథకు పనికివచ్చే బ్రహ్మాండమైన ప్లాటేమీలేదని గ్రహించేసరికి రాంబాబుకి నీరసంవచ్చి ఎదురుకుండా కన్వర్ధ హోటల్లో కెళ్ళాడు కాఫీ తాగుదామని.

అక్కడ దృశ్యాన్నిచూసి రాంబాబు హృదయం ద్రవీభవించింది. సర్వర్ చెయ్యిజారి కాఫీకప్పు ఒక సూట్‌వాలా సూట్‌మీద పడినట్లుంది పాపం ఆ సూట్‌వాలా మాత్రం ఏంచేస్తాడు. సూటంత నీట్‌గా మన సట్టి పెట్టుకోవాలని తెలియక రెచ్చిపోయి ఇష్టమొచ్చినట్లు అరుస్తున్నాడు. మర్యాదస్తుడికి అమర్యాద జరిగితే హోటల్ పేరెక్కడ పాడవుతుందోనని హోటల్ ప్రొప్రయిటర్ సూట్‌వాలాకి నచ్చచెప్ప ప్రయత్నించి విఫలుడై, ఈ సర్వర్ కాకపోతే ఇంకొకడు దొరుకుతాడని సర్వర్‌ని మెడపట్టి బయటగ్గెంటుతున్నాడు వుద్యోగం మానుకుపొమ్మని.

రాంబాబు అర్జంటుగా ఆలోచనల్లోకెళ్ళిపోయాడు ఒక మూలగావున్న టేబుల్‌దగ్గర కూర్చుని ఈ సంఘటన కథగారాస్తే ఎలావుంటుంది? "సంస్కారం లేనిసంఘం" అని పేరుపెట్టవచ్చు, అబ్బో పేరు మోతెక్కిపోతోంది ఇంతకీ కథ ఎక్కడ మొదలుపెట్టాలి? కప్పు జారినదగ్గరనుండా? లేక సూట్‌వాలా తిట్లతో మొదలుపెట్టి కప్పు జారిపడటం ఫ్లాష్‌బాక్‌లో చెప్తేనో - అమ్మో తనకి సినిమారచయితల ఆలోచన్లొచ్చేస్తున్నాయి. ఏమో ఎవరుచెప్పగలరు, ఏదో ఒక నాటికి రాంబాబు ది గ్రేట్ సినీరైటర్ అయిపోతాడేమో అప్పుడు తనకెంత పేరు - టైటిల్స్‌లో తనపేరు చూసుకోవచ్చు. తను రోడ్డుమీద వెళ్తుంటే ఈయనే ఫలానా సినిమాల రచయిత అని అంతా తనగురించే చెప్పుకుంటారు. ఒకవేళ కథకి మొదటి బహుమతివస్తే ఇదే సినిమాగా తీస్తారేమో ఎవరు చెప్పగలరు?... తన ఆలోచనలు ఎక్కడనుంచి ఎక్కడికి వెళ్ళాయో గమనించిన రాంబాబు ఒక్కక్షణం సిగ్గుపడిపోయాడు. మళ్ళీ కథగురించి ఆలోచించడం మొదలుపెట్టాడు- తను హోటల్‌లో ప్రవేశించడందగ్గరనుంచి మొదలుపెడితేనో-తనకి ఒకపాత్ర కల్పించుకోవచ్చు. అప్పుడు తనపేరు రాంబాబు అని రాసుకోవాలా? లేకపోతే పేరులేకుండా "నేను" అంటూ రాయాలా?

అసలు ఆ సర్వర్ చెయ్యిజారి కప్పు కిందపడటానికి కారణం సర్వారాయుడి అశ్రద్ధా? అతనారోజు భోజనంచేసి వుండడా? ఇంటిదగ్గరున్న ఏ జబ్బుతల్లి గురించో తండ్రిగురించో ఆలోచిస్తున్నాడా? ఆదీ ఇదీ గాక పిల్లాడి పాలడబ్బాగురించి వర్రీ అవుతున్నాడా? అదయ్యుండదు. ఎందుకంటే అతనికి పట్టుమని పద్దెనిమిదేళ్ళుకూడా వున్నట్టులేవు, అర్ధగంట ఆలోచించినా ఏదీ తేల్చుకోలేకపోయాడు రాంబాబు. పోనీ, ఇందులో ఏ కారణమయితే చదువరులకి ఆ సర్వర్ మీద జాలి కలుగుతుంది? అతన్నే అడిగితేపోలా. ఆలోచనల్లోంచి తేరుకుని చుట్టూచూశాడు. సూట్‌వాలా వెళ్ళిపోయాడు. సర్వారాయుడికి ప్రొప్రయిటర్‌కి సంధి ఎలాజరిగిందోగానీ పక్క టేబుల్‌దగ్గర వాళ్ళకి దోశ ఇస్తున్నాడు. అయ్యో, దొరికిన ప్లాట్ చేజారిపోయిందే అనుకుంటూ కాఫీతాగి బయటకొచ్చాడు రాంబాబు.

"బాబూ, పసిగుడ్డుకి పాల్లేవండీ ఒక్క పదిపైసలెయ్యండి బాబూ, ధర్మపెబువులు" ఒక నడివయసు